# "మరుపురాని మాఊరు"

శ్రీ పులికంటి కృష్ణారెడ్డి

పుట్టిన ప్రతిప్రాణికి ఎప్పుడూ ఏదో ఒక కోర్కె మనసులో పుట్టుతునే ఉంటుంది. అందులో మానవ జన్మలకయితే అంతూ పొంతువుండనే వుండదు. పుట్టగొడుగుల్లా పుట్టుతుంటాయి. పరిస్థితులు అనుకూలిస్తే కోర్కెలు కొనసాగుతాయి; లేదా, అడవి పూలవుతుంటాయి. నేనూ ఒక ప్రాణినే! అందులో మనిషిననుకొంటున్న వాడిని. అందుకే నాలో కూడ ఓ కోర్కె పుట్టింది. ఓస్! యిదేమి కోర్కె? అని విన్న వాళ్లు నవ్వుతారు. ఇక మా శ్రీమతిగారి సంగతి చెప్పనవసరమే లేదు. మాట చెవిని పడితే చాలు! అప్పటి కదేదో కోరరాని కోర్కె అయినట్లూ దానితో కొంపలు మునుగుతున్నట్లు ఆమె రుసరుసలాడుతుంది. సంపెంగలాంటి అందమైన ఆమె నాసిక ఉన్నఫళంగా ఊదన గొట్టమై బుసకొడుతుంది. ఆమె రుసరుసలు బుసబుసలు ప్రారంభమయ్యేసరికి, అంతవరకు సడీచప్పుడు లేకుండా పడివుండిన పాత్ర సామానులకు అమాంతంగా కాళ్లు వచ్చి, పొగరెక్కిన ఆంబోతులై, ఒకదానిమీద మరొక్కటి కాలుగీరుతూ ఖణిల్లని రంకెలుకూడ వేస్తుంటాయి వంటింట్లో. ఈ అవాంతరాలన్నింటినీ సహించి, ఆపై సాహసించి, అగ్గిబరాటమైన అధికారి ముందు ఒక్కరోజు సెలవుకోసం నసిగే 'ఎన్జీవో'లా నోరుజారితే—'అబ్బబ్బ! మా వూరు! మా వూరు!! అని ఒకటే మొత్తుకోళ్లు. ఏం వుందక్కడ? చేరెడు మంచి నీళ్లిచ్చే గతివుంటే యిక చెప్పనవసరమే లేదు!'' అని నిలదీసి అడుగుతుంది. నా నోరు తడబడతుంది. నిజమే! అక్కడ—అంటే ఆ పల్లెలో యేమీ లేదు. పల్లెనుండి బండకెత్తి తోలుకరావడానికి ముల్లెలూ లేవు. విచ్చి వికసించి నా కోసం ఎదురుచూచే మల్లెలూ లేవు.

ఆ పల్లె 'మిద్దె ఊరు'గా వాసికెక్కింది. మిద్దె లెరుగని నాటికే ఆ పల్లెలో వెలసిన మిద్దెలు ఆ పల్లె కాపేరును సార్థకపరచాయి. మా తాత పెదరామిరెడ్డి. ఆతని తమ్ముడు చినరామిరెడ్డి. ఆ పాయకట్టులో వీళ్ళిద్దరు మకుటంలేని మహారాజుల్లా బ్రదికారు. ఈ నాటికీ మేము వాళ్ళ పేరుమీద చేరెడు నీళ్లు త్రాగగలుగుతున్నా మా పాయకట్టులో అంటే—మా శ్రీమతిమాత్రం సుతరాము అంగీకరించదు కానీ, యిదిమాత్రం కాదనలేని సత్యం. పెదరామిరెడ్డి చినరామిరెడ్డి యిద్దరు అన్నదమ్ములు. దున్నపోతు దున్ని చావాలి. అన్నదమ్ములై పుట్టితే వేరుపడి తీరాలి. పెదరామిరెడ్డి, చినరామిరెడ్డి కూడ వేర్లుపోయారు. సగం గ్రామం పెదరామిరెడ్డి యేలుబడిలోనికి వస్తే, మరో సగం చినరామిరెడ్డి మోచేతి క్రింద నిలబడింది.

పెదరామిరెడ్డి పేరుకుదగ్గ మనిషి. గుండెబలం, కండబలం మెండుగావున్న మొనగాడు. కల్లు అంగళ్ల యిజారాదారుడతగాడే! ముద్దుకొమ్మల పెద్దపెద్ద కళ్లల్లోని కైపుజీరకోసం పారాడేదీ అతగాడే! మదిర! మదువు!!—ఎప్పుడూ పదిమంది చుట్టూ సరివేష్టించి వుండేవారు. పదిమంది వుంటే పది రకాల మాటలూ వుండడం కద్దు. వేర్లుపడిన అన్నదమ్ముళ్లలో ఈర్ష్యాగ్ని రగలడానికి అదను పదును జూచి ఒక్కొక్క సమిధను సమర్పించేవాళ్లు కొందరు. ఫలితంగా పెదరామిరెడ్డి పూరిండ్లు పరశురామప్రీతి అయినవట!

ఇదంతా చినరామిరెడ్డి పన్నాగమన్నారు కొందరు. కాదు కాకతాళీయమన్నారు మరికొందరు. అన్నదమ్ముళ్లను జుట్లు పట్టించి, వేడుక చూడడానికి, మధ్య రాలింది యేరుక తినడానికి ఎత్తుగడ అన్నారు కొందరు. ఆ పల్లెపట్టులో ఊహాగానాలను మోయలేక మూలిగాడు వాయుదేవుడు. పెదరామిరెడ్డి మాత్రం నిప్పులు కక్కినాడు. కత్తికి కండ చేయాలనుకొన్నాడు తమ్ముడిని. ఎంతయినా రక్తపాశం గదా?

'పూరిండ్లయితే కాల్చగలిగాడు వెధవ!—అదే మిద్దిండ్లయితే?'—ఒక్క వెక్కినవ్వుతో సరిపెట్టుకొన్నాడు. మూడుం ముక్కాలు గడియకే మిద్దెయిండ్లు కట్టించాలనుకొన్నాడు. అర ఫర్లాంగుదూరం చుట్టూ ప్రహరీ గోడ...మధ్యలో ఓ సుద్దమిద్దె!—గృహప్రవేశ మహోత్సవానికి నాలుగు కండబట్టిన పొట్టేళ్లు...నాలుగు బానల కాపుసారా అయిపులేకుండా అయిపోయిందట!—ఈనాడు ప్రజాప్రభుత్వములో ఎన్నికలకు ఎర అయిపోతున్న సామాన్యజనానికి పూర్వీకులు వాళ్ళు—తిని త్రాగిన మత్తులో పెదరామిరెడ్డికి జై! మిద్దారికీ జై!!'—అన్నారట: ఆనాటినుండి ఆ వూరు మిద్దె వూరుగా వాసికెక్కింది.

వాళ్లతరం చెల్లింది. మా నాన్నగారి హయాములో ఆ సుద్దమిద్దెలు భద్రంగానే కాపాడబడ్డాయి. లేదంటే—చుట్టూరావున్న అర ఫర్లాంగు దూరం ప్రహరీగోడ మాత్రం అక్కడక్కడ పడిపోయింది. సుద్దమిద్దెను లాదుమిద్దెగా మార్చాలన్న సంకల్పంతోనే ఆయన జీవితకాలం సరిపోయింది. ఆ తరువాత నేను ఉద్యోగరీత్యా ఊరు వదలిపెడితే, మా అన్నగారు బాధ్యతలను తలకెత్తుకోవడం జరిగింది. అన్నగారికి మా తాతగారి గుణాలన్నీ అలవడ్డాయని అంటుండేవారు. వినడమేకాని, కనడానికి అస్కారం లేకపోయింది నాకు. ఎవరో ఓ జ్యోతిష్కుడు మా అన్నగారింటికి వచ్చారట. అసలే అన్నగారికి తలరాతకంటే జాతకాల మీద నమ్మకం యెక్కువ. జ్యోతిష్కునికి గౌరవ మర్యాదలు ఘనంగానే జరిగాయి. ఆ దెబ్బతో ఉబ్బి తబ్బిబ్బైనాడు జ్యోతిష్కుడు. 'నాయనా! నీవు మీ తాతంతటివాడవుతావు, మీ తాత సుద్దమిద్దెలు కట్టిస్తే—నీవు పెద్దపెద్ద మహడీలే కట్టిస్తావు. అయితే మీ తాతగారు వాస్తుశాస్త్రాన్ని పాటించలేదు. అందుకే ఈ కుటుంబం మూరెడు ముందుకు వెడితే బారెడు వెనక్కు వస్తూవుంది. ఈ యింటికి తూర్పు వాకిలి అరిష్టదాయకము. దక్షిణపు వాకిలి పెట్టావంటే—దేదీప్యమానంగా వెలిగిపోతుంది సంసారం' అన్నాడట. అంతే! తాతకు దగ్గ మనుమడు గదా? కట్టించడానికి మూడుంముక్కాలు గడియపడితే, పడగొట్టించడానికి ముక్కాలు గడియ సరిపోయింది. సుద్దమిద్దె సుద్దంగా నేలమట్టమయింది. దూల మొకటి విరిగి అన్నగారి కాలిమీద పడింది. ఆయన నేలకు ఒరిగాడు. ఒరిగినతడు లేవలేదు కానీ; ఆ యింటి అడుగులో జిల్లేళ్లు మాత్రం లేచాయి. పాడుపడిన ప్రహరీగోడ...జిల్లేళ్లు మొలిచిన యింటి అడుగు...మా తాతగారి గత వైభవ స్మృతి...కళ్లు చెమర్చుతాయి ఆ యింటిముందు నిలబడితే! అందుకే మా వూరిని మరచిపోలేను.

పుట్టిన ఊరిపై మమత పూడిపోతుంది కాలగర్భంలో. కానీ మా వూరిపై మమత యినుమడిస్తూనే ఉంటుంది క్రమేణ. కారణం ఆ ఊరి నిర్మాణం అలాంటి చక్కటి ప్రదేశంలో జరిగింది. ఊరికి దక్షిణంగా మంచినీటికొలను. ఆ కొలను నిండుకు విచ్చి వికసించిన కెందామరలు. ఆ గుంటకట్టపై చల్లని నీడ నిస్తూ పచ్చనిచెట్లు...ఆ చెట్ల క్రింద చలువరాతి బండలూ...ఆ బండలమీద పులిజూదంతో ప్రొద్దుపుచ్చే కలిగిన యింటి కామందులూ...ఊరికి ఉత్తరంగా అల్లంతదవ్వులో పెట్టని కోటగోడల్లా పచ్చని కొండలూ...ఊరి చుట్టూ అంతకంటే పచ్చని పొలాలు...ఊరి మధ్యలో రామాలయం...రాత్రిపూట ఆ ఆలయంలో భజనలు...ఏ చెట్టుక్రింద కూర్చున్నా తిండితిప్పలే మరచిపోవచ్చుననిపిస్తుంది. బాల్యమంతా ఆ గ్రామంలోనే గడచిపోయింది. మానవుడి జీవితములో మధురాతిమధురమైనది బాల్యదశ. ఆ దశ...అది గడచిన చోటు...చెరగనిముద్ర వేసుకొంటాయి ప్రతి వ్యక్తి గుండెల్లో. తలంపుకు వచ్చినపుడు మనిషిని తైతక్కలాడిస్తాయి. ఆ వూపును ఆపుకోవడం కష్టం. అందుకే ఉద్యోగ బాధ్యతలు ఒకవైపు వేధిస్తున్నా, శ్రీమతి మరొకవైపు సాధిస్తున్నా, లెక్కచేయకుండా పల్లెను చూడడానికని బయలుదేరాను. దాదాపు పదేళ్ల తరువాత నేను పుట్టి పెరిగిన పల్లెను చూడడానికని బయలుదేరాను.

నలభైమైళ్ల దూరాన కొండల గుండెల్లో దాక్కొన్న మా పల్లె, మూడు బస్సులుమారి, ఆపై నాలుగుమైళ్ళు కాళ్లీడ్చుకొంటూ నడిస్తేనేగానీ కంటబడదు. ఈ పదేండ్లలో ప్రభుత్వం సాధించిన ప్రగతి ఫలితంగా, యిప్పుడా నాలుగుమైళ్లు కూడ నడువ నవసరము లేదట! ఒక్క డొక్కుబస్సుతో ఢక్కాముక్కీలు తింటూండిన నలగాంపల్లి నాయుడు గారికి నాలుగు బస్సులయ్యాయట. రెండంటే రెండు గంటలు అక్కడ వేచివుంటే బస్సు వస్తుందట

ఆ అడవి కొంపల్లో అడిగే నాథుడే లేడు కాబట్టి ఉప్పు మూటల్లా మనుష్యుల్ని బస్సులో కూరుతారట! కాగా సీటు దొరకదన్న భయమేలేదని అభయమిచ్చారు పెనుమూరుపేట బస్సు స్టాండులో. అప్పటికి రెండు న్నర దశాబ్దాల క్రిందటిమాట. తూర్పున పట మెగు రకముందే అమ్మకట్టిచ్చిన సద్దిబువ్వ మూటలు భుజాలకు తగిలించుకొని పెనుమూరులోని హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాలలో చదువుకోవడానికి నడిచివచ్చే వాళ్లం. బడిలో చదువుకోవడం, మధ్యాహ్నం పూట యే జానిగట్టుమీదనో కూర్చుని చద్దిబువ్వతినడం, సాయంత్రం బడి వదలగానే మళ్లీ నాలుగుమైళ్లు నడచి యిల్లు చేరుకోవడం—చదివి ఏదో సాధించా లన్న తలంపుముందు నాలుగు నాలుగు ఎనిమిది మైళ్లు నడచిన బాధ తెలిసేది గాదు. అందులో అంతా ఒక యీడు పిల్ల వాళ్లం. కలిసి ఆడుకొంటూ, పాడు కొంటూ తిరిగే వాళ్లం. అదంతా మనసులో మెదిలే సరికి రెండు గంటలు బస్సుకోసం పడిగాపులు పడి వుండడం కంటే నడచి వెళ్లడమే మంచిదనిపించింది. పెనుమూరినుండి నడక ప్రారంభించాను.

మా ఊరి మట్టిబాటమీద పడి నడుస్తు న్నాను. ఏదో పూనకం పూనినట్లు పూర్వస్మృతి ఆవరించింది. అడుగుతీసి అడుగువేస్తుంటే నడచి నట్లు తెలియడమే లేదు. ఎక్కడో, యేదో, స్వర్గ సుఖంలాంటిది నా కోసం కాచుక కూర్చున్నట్టు, దాని కోసమే నేను నడచివెడుతున్నట్టు—అదొక దివ్యాను భూతి. ఆ మట్టి నాకు సుపరిచితమైనది. ఆ మట్టిలో ఆడుకొన్నాము. పడి దొర్లాము. కోప మొచ్చి కొట్లాడు కొన్నప్పుడు ఆ మట్టినే ఆయుధంగా ప్రయోగించి ఒకరిపై ఒకరు చల్లుకొన్నాము. ఆ తరువాత దుమ్ముతో నిండిన దుస్తులనుచూచి నిస్సహాయంగా యేడ్చుకొన్నాము. ఇవన్నీ మనస్సులో మెదలుతూంటే గుండె ఉబ్బిపోతూ వుంది. అంతలో ఎవరో ఒక రైతు బిడ్డ మంచి కండబట్టిన గిత్తల్ని బండికి గట్టించి పరుగెత్తిస్తున్నాడు. ఆ గిత్తలు పరుగులెత్తే కొద్దీ అతడికి హుషారుయెక్కువై పోతూవుంది. అతనిలో హుషారు యెక్కువయ్యేకొద్దీ గిత్తలు పరుగు హెచ్చి స్తున్నాయి. మట్టిబాటమీది కాలిరంగు దుమ్ము సంధ్యా రుణకాంతులతో పోటీ పడుతూ లేచింది. కలిగినవాని కైవు కన్నుల్లోని కోపం బాగ లేచింది. దారి ప్రక్కన నడుస్తున్న నన్ను నిలువునా కప్పివేసింది. ఓ రోజు ఆఫీసులో మా రాధయ్య టేబిలు తుడుస్తున్నాడు. ఎక్కడో కాస్త దుమ్ము వదలిపోయింది. ఆ రోజు వాడి తిక్క కాస్త కుదిరిపోయింది. అదీ దుమ్మే! ఇదీ దుమ్మే!! - అయితే ఆ దుమ్ముకు ఈ దుమ్ముకు ఎంత తేడా?—ఆ అనుభూతిలో అది దుమ్ము కాదు—ఓ మహా త్ముని చేతినుండి రాలిన విభూతి! నాలో నేను నవ్వు కొంటూ నడుస్తున్నాను.

'ఏ వూర్సా మీది?'

సుమారు మూడు పదులు వయస్సు దాటిన వాడు ..మూతి మీది మీసాన్ని మెలివేసినవాడు...అడ్డ పంచ అరవకట్టుపై టెరిలీన్‌స్లాక్ ధరియించిన వాడు—పల్లె పట్టణంలో వియ్యమంది నేర్చుకున్న నాగరకతకు అల్లుడై నలుగుతున్నవాడు...మా వూరి మట్టిబాటపైనా ప్రక్కన నడుస్తున్నవాడు... ... ప్రశ్నించాడు.

మనిషిని కాసేపు ఎగాదిగా జూచి 'మిద్దూరు' అన్నాను.

'మిద్దూరా?' ఆశ్చర్యం ఆవిర్లు కక్కింది అతడి మాటల్లో.

'అవును.'

'మిద్దూర్లో ఎవురబ్బా?' అతగాడి సందేహం.

'పెదరామిరెడ్డి మనుమణ్ణి.'

'పెదరామిరెడ్డి మనవడా? మరి నడిచే పోతుండావే?'

అదో రకంగా చూశాడతడు నా వైపు. 'పెద రామిరెడ్డి మనుమ డేమిటి? మరి నడువడ మేమిటి?' అన్న ఆశ్చర్యం అతని చూపుల్లో తొణికిస లాడుతూ ఉంది. పెదరామిరెడ్డి మనుమడు నడువకూడదన్న సత్యం నే నెరుగనిది. అప్పటికి మా తాత గతించి అర్ధ శతాబ్దం దాటింది. అర్ధ శతాబ్దం తరువాత అతని మనుమడికి జరుగుతున్న గౌరవ మర్యాదలకు, మా తాత పేరుప్రతిష్ఠలకు ముడివేయడానికి ప్రయ త్నించాను. పొంతనాలు కుదరలేదు. అదే ఆలోచిస్తూ నడుస్తున్నాను.

'అది గాదుసా! ఆ గొబ్బిళ్ల మిట్టలో మాట మాత్రం అనుంటే ఎవుడైనా ఒకడు బండి కట్టే వాళ్లే! ఈ బారెడుదూరం బండి కట్టితే కొంపలు మునిగిపోతాయా?'

'పోనీ! ఈ బారెడుదూరం నేను నడిస్తే మాత్రం మునిగిపోయే దేముంది?'

'ఒలేవాడుసా నువ్వు? అప్పిటికి మేవంతా బతికి నట్టా? సచ్చినట్టా? ఈ గొబ్బిళ్ల మిట్టకు పినపెద్ద మా తాత. మీ తాత మా తాత సావాసకాపులంట. ఈ పొద్దు మా సేతినీళ్లు మేఁవు తాగుతుండావంటే అది మీ తాత సేతి సలవేనంట!'

ఇలాంటి మాటలు ఆ పాయకట్టులో తరచు వినబడుతున్నవే! అయితే మీ తాతగారు ఎవరి కేలాంటి సహాయం చేశారో వివరాలుమాత్రం తెలి యవు. అయితే ఈ తరానికి ఆ తరానికి భేదం మాత్రం కొట్టవచ్చినట్లు కనబడుతూనే వుంది.

మా ఆఫీసుకు ఆరునెలల కొకసారి ఓ కవి వస్తూ ఉండేవాడు. ముందెప్పుడో ఓ రాక్షసుడు ఆరు నెలల నిద్ర, ఆరు నెలలు తిండిగా బ్రదికాడట. ఆ విధంగా ఈ కవి ఆరు నెలలు దేశాటనం చేస్తాడు. తన పుస్తకముల నమ్ముకొంటాడు. వచ్చినది తింటూ స్వస్థలంలో కూర్చుని మరో ఆరునెలలు కవిత్వం వ్రాసుకొంటాడు. తెలుగుదేశంలో పరిస్థితులకు ఎదు రీది బ్రదికేది తానొకడేనంటూ ఢంకా భజాయించి చెబుతాడాకవి. ఆ కవి ఒకప్పుడు ఉద్యోగార్థమై దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి దగ్గరికి వెళ్ళాడట. వెళ్లి ఒక ఉద్యోగమిప్పించమని సవినయంగా మనవి చేసుకొన్నాడట. అప్పుడు పంతులు గారు 'నీకు తెలుగు వచ్చా?' అని ప్రశ్నించాడట! 'అయితే మీకు తెలుగు రాదా?' అని ఎదురు ప్రశ్న వేశాడట కవి. పంతులుగారు ఆశ్చర్యపడి చూస్తూంటే, 'ఇంతసేపు నేను మాట్లాడింది తెలుగే గదండీ!' అన్నాడట కవి. చిరునగవుతో తలపంకిస్తూ పంతులు గారు కవిగారికి వెంటనే ఉద్యోగం యిచ్చారట! ఈ తరాల ప్రసక్తి వచ్చినపుడంతా కవి పంతులుగారి వద్దచేసిన ఉద్యోగానుభవాలు ఉటంకించే వారు.

పంతులుగారిని ప్రతిదినము ఎందరో దర్శించే వారట. 'ల'కు ఏత్వము, 'ద'కు కొమ్ము—యివ్వలేని దాతలట పంతులుగారు. కొన్ని సమయాల్లో కొందరు ఆయనను పచ్చిగా మోసగించేవారట! 'పంతులుగారూ! మదరాసు చూద్దామని బందరునుండి వచ్చామండీ! ఎవరో దొంగ వెధవలు జేబు కొట్టేశారండీ! తిరుగు వెళ్ళాలంటే చార్జీలుకూడ లేవండీ!' అని మొరపెట్టు కొనే వాళ్లట. అలా అడిగి నతనిని ఒకసారి పరి శీలిస్తే—అతడు సిల్కు లాల్చీ తొడిగి వుంటాడట. చేతివ్రేలి వ్రేలికీ బంగారు ఉంగరాలుంటాయట. కిళ్లీ వడవేసి నములుతూ వుంటాడట. ఈ వ్యక్తికి జేబు దొంగతనం జరిగి వుంటుందా? అన్న ఆశ్చర్యం కలుగుతుందట! కానీ పంతులుగారు అతనివైపు చూడనే చూసేవారుకారట. జేబులో చెయ్యి వేయడం చేతికి వచ్చింది వచ్చినవాడి అదృష్టంమీద ఆధారపడి వుంటుందట. 'ఆ కాలానికి, ఈ కాలానికి పొటిబెట్ట డానికి వీలుకాదులే నాయనా! ఎందరో పంతులుగారి ఆశ్రయములో బ్రదికితే—ఈ నాడు యింత ఆంధ్ర దేశం నాలాంటి ఒక్కకవిని పోషించలేని స్థితిలో వుంది.' అని వాపోయే వారు.

ఉప్పతిని, తిన్నయింటికే వాసాలెంచేది ఈ తరం. మా తాత మీ ముత్తాతకు పది రూపాయలు బాకీ యిచ్చాడట. వడ్డీ అసలు కలిపితే అంతకు మూడంతలయింది. 'అక్కడపెట్టి కదలు!' అనేది ఈ తరం. అయితే ఈ తరంలోకూడ కృతజ్ఞతా భావం చావలేదే అనిపిస్తూ ఉంది అతని మాటలు వింటూంటే! అతడి అభిమానానికి కృతజ్ఞత ఎలా తెలుపడమో తెలియక మౌనంగా నడుస్తున్నాను.

'ఏఁవిసా? నోరు గదిపితే నోటి ముత్యాలు రాలిపోతాయా? ఆఁ! వూఁ! అనకుండా బెల్లంకొట్టిన రాయి మాదిర నడుస్తుండారే!' అమాయకంగా ప్రశ్నించాడు మా తాతగారి స్నేహితుడుగారి మనుమడు.

నిజమే! మూడు పూటలు తిండిలేక మూలుగు తున్నా, ముక్కులుదాకా మెక్కి త్రేన్పుతున్నా, దహన సంస్కారానికి నోచుకోలేక కొంపలో శవాన్ని పెట్టు కొని కుమిలిపోతున్నా, ఎవరికి వారిదే దారిగా అదే సభ్యతగా రూపొందిన పట్టణ వాతావరణాన్ని నిలు వెల్లా నింపుకొన్న వాడిని. పల్లెపట్టుల్లో అరమరికలు లేని తేనె పట్టుల్లాంటి మనస్సులలోని ఆధార భావాన్ని జుఱ్ఱుకోవడం మరచిపోయిన వాడిని. మతికితెచ్చుకోవ

డానికి, మాటల రూపాన్ని యిచ్చుకోవడానికి కాసేపు పట్టిన మాట వాస్తవం.

‘ఎంతవరకు వెడుతున్నావయ్యా?’

‘నువ్వెక్కడికో నేనూ అక్కడికే!’

‘మా ఊరికా?—నాకు తెలియకనే ఆశ్చర్యం ధ్వనించింది నా మాటల్లో.

‘ఎందుకుసా అట్లులిక్కి పడతావే? రేత్రికి మీ ఇంటికి రాన్లేబ్బా దండగ తిండికి!’

నా మనస్సు చివుక్కుమనింది. అప్పటికి ఆ వూళ్లో నాకొక యిల్లు ఉన్నట్లు, అతడు చుట్టమై దాపురించనున్నట్టు, దానికి నేను బెంగపడి పోయినట్టు అనుమానపడ్డాడు అమాయకుడు. అందుకే మెత్తమెత్తగా ఎత్తిపొడిచాడు. అయినా నేనేమని చెప్పగలను? అతడి హృదయములో పెసరామిరెడ్డి మనుమడికున్న విశిష్ట స్థానాన్ని ఎలా తుడిచివేయగలను? తలదాచుకోవడానికి కానీ, కడుపు తడి చేసుకోవడానికి కానీ, ఆ ఊళ్లో అప్పట్లో నాకంటే గూడ అతడే అదృష్టవంతుడని నేనెలా చెప్పగలను? అభిమానం అడ్డుపడింది. అయిన దానికీ, కాని దానికి అభిమానాలు పెంచుకుంటూ, అంతస్థులు సృష్టించుకుంటూ, ఆత్మవంచన చేసుకుంటూ బ్రదికే పట్టణాలకు తొత్తును. అరమరికలు లేకుండా ఆ పల్లీయునితో ప్రసంగించడం కష్టమనిపించింది. ప్రసంగం మార్చదలచాను.

‘మా వూరి కంటున్నావే? ఏం పనిమీద?’

పకపకా నవ్వాడతడు. ‘నీ యాదన నాకు తెల్సులే!’ అన్నట్లుందా నవ్వు.

‘మీ వూరిగ్గాదుసా నే నొచ్చేది. ఇంకొంచెం పైకే పోతుండా. పెనుఁవూరు ముత్తేలమ్మకు పొంగళ్లు పెడుతుండాం. బొట్లోళ పల్లెలో మా బందుగులుండారు. పిలద్దామని పోతుండా. నీ పెండ్లి నడక నాకు కుదిరేట్టులేదు. నే వస్తా.’—అతడు కాస్త జోరుగా కాలాడించాడు.

అంతవరకు అటు యిటూ త్రాగినవాడి మనస్సులా తూలుతూ, తనువులా పడుతూ లేస్తూ వచ్చిన మా వూరి మటి బాట అక్కడ—ఆ మామిడిమాకుల వంక దగ్గర వున్నట్లుండి మిట్టదారి పట్టింది. నరాలలాగే మిట్ట అది. ఆ మిట్ట యెక్కుతున్నాను. గస ఎగ్గొట్టున వస్తూవుంది. ప్రొద్దు బాగా పడమటికి వాలింది. చిట్టడవి గుండెల్ని చీల్చుకపోతున్న ఆ మట్టిబాట సంధ్యారుణకాంతులతో రక్తసిక్తమైనట్లుంది. మామిడిమాకుల వంక కంటబడి గస పోసుకొంటూ నేను మిట్ట ఎక్కుతూంటే—మెల్లగా గుండెలమీద పడింది. అక్కడ కాస్త ఆర్ద్రతను రంగరించుకొని మెదడును సృజించింది. అలవాటు తప్పడంలో ఎక్క లేక నేను మిట్ట యెక్కుతూంటే మెదడు గతాన్ని త్రొక్కడాని కారంభించింది.

మామిడిమాకుల వంక ఆ చిట్టడవిలో వయ్యారంగా వాహ్యాళికి బయలుదేరిన చిన్నారిలాంటి చిన్న వంక. వానకాలంలో తాను గూడ ఒక వంక నని పిస్తుంది. మిగత రోజుల్లో ఆ వంకలోని యిసుక మా పాలిట కామధేనువు. బడి వదలగానే కొంప లంటుకపోతున్న వేగంతో ఆ వంకలో చేరుకునేవాళ్లం. చెడుగుడు ఆడేవాళ్లం. ఉప్పరపట్టి కాసేవాళ్లం. బాగా చీకటిపడితేగాని ఆ వంకను నడిచేవాళ్లం కాము. ఆడి ఆడి అలసిసొలపి చెమటోడ్చుతూ యింటికి వెడితే ‘పాపం! పిలకాయలెంత కష్టపడి చదివినారో!’ అని యింట్లో పెద్దలు వాపోయేవారు. బాటకు కూతదవ్వులో, ఈ వంక గట్టుమీద ఒక బావి వుంది. ఆ బావిలో నీళ్లు అప్పుడే వార్చిన గంజిలాగ వుంటాయి. అందుకే ఆ బావికి ‘గంజినీళ్లబావి’ అన్న పేరు సార్థకమయింది. చుట్టూ నేరేడుచెట్లు, మామిడిమాకులు, పరిగపొదలు...ఆ బావి చుట్టూ అందమైన మట్టిగట్టు. ఆ వాతావరణాన్ని చూస్తే అక్కడ కాసేపు కూర్చుందామన్న బుద్ధి పుడుతుందెవరికైనా! మిద్దూరునుండేకాక చుట్టుపట్ల గ్రామాదులనుండి మేము యేడెనిమిది మంది వెడుతూ వుండేవాళ్లం పెనుమూరు హైయర్ ఎలిమెంటరీ పాఠశాలలో చదువు కొనడానికి. ఓ రోజు అందరూ గంజినీళ్ల బావి గట్టుమీద కూర్చున్నాం. ప్రొద్దు క్రుంకబోతూవుంది. ఆ రోజు ఎందుకో ఆటలు మాని ఆ బావి గట్టుమీద కూర్చున్నాం. మాలో అందరికంటే వయస్సులో పెద్దవాడు చిన్నబ్బ. హరిజను డతను. హాజరు పట్టికలోనే అతడి పేరు చిన్నబ్బ. మాకు

పెద్దగా పట్టింపులు లేకుండినా అందరు అతనిని 'చిన్నోడా!' అని పిలిచేవాళ్ళం. ఆ రోజున ఉన్నట్టుండి, 'ఒకనాటికి ఈ బావిగట్టుమీద వనభోజనంచేస్తే బాగుండును!' అని చిన్నబ్బ ప్రతిపాదించాడు. అందరు సరేనంటే సరేనని ఎగిరి గంతేశారు. మూడు కోళ్ళు తేవడం ముగ్గురివంతు అయింది. బియ్యం తేవడానికి మరో ముగ్గు రంగీకరించారు. దీనికి కావలసిన మసాలా ద్రవ్యాలు తేవడం మిగిలినవారిమీద పడింది. అడవిలో కట్టెల కేమీ కొదువలేదు. 'ఎప్పుడో ఎందుకు? రేపే పెట్టుకుంటే పోలా!' అన్నాడు చిన్నోడు. అందరు దీనికి కూడ సరేనన్నారు.

బియ్యం తేవడాని కంగీకరించిన ముగ్గురిలో నే నొకడిని. మిగత యిద్దరు అంత వెసులుబాటున్న వాళ్ళు గాదు. అందుకే వాళ్ళు నా చేతులు పట్టుకొని, 'ఎట్లయినా ఈ గండం గడపరా!' అని బ్రతిమాలారు. అభయ మిచ్చాను. కానీ నా భయం నాది. అయ్యగారు తెమ్మన్నారని అబద్ధం చెబుదామనుకొన్నాను యింట్లో. కానీ పెనుమూరి పేటలో సంతకని వచ్చిన మా అయ్య, అయ్యవారిని నిలబెట్టి అడిగినా అడుగును. అందుకని ఆ ఆలోచన మానుకొన్నాను. ఆ రాత్రికి భోజనానంతరం, ఆ యిద్దరినీ వచ్చి కలుసుకోమని చెప్పి యింటికి వెళ్ళాను.

నా మాటప్రకారం వెంట్రాయులు, శిద్దయ్య యిద్దరు భోజనంచేసి వచ్చారు. నన్ను పిలిచారు. అప్పటికే నేను లాంతరు ముట్టించి పెట్టుకొని మా వసారాలో కూర్చుని శ్రద్ధగా చదివినట్లు నటిస్తున్నా. పిలుపు చెవిని బడడంతో లేచి వెళ్ళతూంటే, 'ఈవేళ కాడెక్కడిరా?' అన్నాడు మా అయ్య ఎద్దులకు తవుడు కలిపి పెడుతూవుండి. 'ఇప్పుడే వస్తానయ్యా!' అంటూ బయటపడ్డాను. పల్లెటూళ్ళల్లో సాధారణంగా తొమ్మిది గంటల వేళకే మాటు మణుగుతుంది. ఎవరో ముసలీ ముతక మాత్రం నిద్రరాక వీధుల్లో రాతి తిన్నెలమీద కూర్చుని పిచ్చాపాటి మాట్లాడుకొంటున్నారు. ఆవేళప్పుడు మేము ముగ్గురం కలుసుకొన్నాము. కర్తవ్యాన్ని ముచ్చటించు కొన్నాము. మా యింటి వెనుకవైపుకు నడచాము. ప్రహరీగోడ క్రింద వెంకట్రాయులను నిలబెట్టి, మే మిద్దరం గోడదాటి లోపలికి వచ్చాం. ఇంటికి ప్రహరీగోడకు మధ్య ఖాళీజాగాలో, జామచెట్లు గుబురుగా వున్నాయి. ఆ చెట్లమాటులో శిద్దయ్యను కూర్చోమన్నాను. నేను మరలా గోడదాటి యిల్లు చేరుకొన్నాను. వసారాలో లాంతరుముందు కూర్చుని చదివిందే చదివిందిగ వున్నాను. నా చదువు నాకే అర్థం కాలేదు. ఏదో వాగుతున్నాను ఎవరికేమీ అర్థం కాదులే అన్న ధైర్యంతో. ఇంట్లో అందరు పడుకొన్నారు. మా అయ్య పశువుల కొట్టంలో మంచంమీద పడుకొంటూ, 'ఒరే నాయనా! జావులేత్తిరి దాటినట్టుండాది. సదువంతా ఈ ఒక నాడే సదివేస్తే ఎట్టరా? రేపిటికిగూడ కాసింత వుణ్ణీ నాయనా! పడుకోమ్మా!' అని గోముగా మందలిస్తున్నాడు. లాంతరు వెలుగు తగ్గించాను. పడుకొన్నానేగానీ మనస్సంతా యింటి వెనుకవే తారట్లాడుతూ వుంది. నిముష మొకయుగంగా గడుస్తూ వుంది. కుక్కలు మొరిగితే చాలు, శిద్దయ్య వెంకట్రాయులు యేమవుతారో అని గుండెకొట్టుకొంటూ వుంది. ఈ గుంజాటనలోనే దాదాపు గంట గడిచింది. రకరకాల గురకలు మెల్లగా ఆరంభమై తారస్థాయి నందుకొంటున్నాయి. ఆ గురకల శబ్ద విన్యాసము అంతవరకు నా ఎఱుకలో లేనిది. మరొకప్పుడైతే నిజంగా పడిపడి నవ్వేవాడిని. కాని ఆ పరిస్థితిలో అప్పటికి నా మనస్సు కాస్త కుదుటబడింది. లాంతరు బాగా తగ్గించాను. చాపమీద రెండు దిండ్లు అటు యిటుగా పరచి దుప్పటి కప్పాను. పుస్తకాలను లాంతరు ముందర చిందరవందరగ పడవేశాను. మెల్లగా అరలో ప్రవేశించాను. ఆ అర మా యింటి 'స్టోర్ రూమ్' అన్నమాట. అక్కడే నట్టిల్లువుంది. ఒక ప్రక్క వరుసగా ధాన్యపు దొంతరులున్నాయి. మరొక ప్రక్క గాదెలున్నాయి. గాదెలకు ఎదురుగావున్న గోడలో రెండు అల్మయిరాలున్నవి. అందులో ఒకటి మా అయ్యది. రెండవది మా అమ్మది. ఆ గదిలో అడుగు పెట్టేసరికి గుండె గడగడ లాడింది!

ఒకప్పుడు మా రెండవ అన్నయ్య ఆ గదిలో పడుకొనేవాడు. 'ఎందుకురా ఆ వుక్కలో పడి చస్తావు? అని అడిగితే ధ్యానం చేసుకోవడానికని బుకాయించేవాడు. మా అమ్మ ఓ పెద్ద బుడిగ హుండీ తన అల్మయిరాలో పెట్టింది. అందులో దినము కొంత ఏడుకొండలవాడి ముడుపుక్రింద వేస్తూ వుండేది.

మారుబీగంతో మాటుమణిగిన వేళ ఆ అల్మయిరా తెరచి మా అన్నయ్య బుడిగ హుండిలోనుండి తనకు కావలసినంత బహుచాకచక్యంగా రాల్చుకొనేవాడు. ఇది దేవ రహస్యం. ఇలా కొంతకాలం జరిగింది. ఒకనాడు ఎందుకో మా అమ్మ బుడిగ హుండీని ఎత్తిచూచింది. చాల తేలికగ వుంది హుండీ! ఇన్నాళ్లనుండి వేస్తున్న డబ్బు యే మైనట్లని ఆమెకు సందేహం కలిగి, కోపంతో ఆ హుండీని నేలకేసి కొట్టింది. ఏముంది? నిజంగానే ఖాళీ ఆహుతీ! ఆ హుండీ పాలిటికి ప్రత్యక్ష దైవము వేంకటేశ్వరుడు మా రెండవ అన్నయ్య అని గ్రహించడానికి మా అమ్మకు ఎక్కువకాలం పట్టలేదు. ఆ తరువాత చూడాలి మా అమ్మ స్వరూపం. ప్రళయ కాళికాదేవి అయింది. ఇల్లంతా చిందులు త్రొక్కింది. పొలం పనులకు వెళ్లిన మా అన్నయ్య యింట్లో అడుగుపెట్టాడో లేదో ఆతనిమీద విరుచుకపడింది. తరిమితరిమి కొట్టింది. మా వూరి గుంటకట్ట పైవరకు తరిమికొట్టింది. చేతి కందకపోయేసరికి రాళ్లు రువ్వింది. చెట్టంత మనిషి మా అన్నయ్య కొట్టిన దెబ్బలు తిన్నాడేకానీ మారుమాట్లాడలేదు. ఆ దృశ్యం మనసులో మెదిలి, నేను తలపెట్టిన కార్య పర్యవసానం తలంపుకు వచ్చేసరికి శరీరం తూలు తున్నట్లనిపించింది. కష్టసాధ్యంగా నిలద్రొక్కు కున్నాను.

చీకట్లో మెల్లగా తారట్లాడుతూ దొంతర లను సమీపించాను. ఏమాత్రం అలికిడైనా గుండె గుభిక్కుమంటూ వుంది. ఒక్క దొంతరను మెల్లగా క్రిందికి దించాను. మిరపకాయలు, ధనియాలు, కంది పప్పులు ఒక్కొక్క కుండలో చేతికి తగులుతున్నాయి. నాకు కావలసింది బియ్యం. భయం ఓర్పును మింగేస్తూ వుంది. ఆ దొంతరను మరలా యథాతథంగా ఉంచాను. రెండవ దొంతరను దించడాని కారంభించాను. జొన్నలు, సజ్జలు, రాగులు కనుపిస్తున్నాయి. మూడవ దొంతరను ముట్టుకోబోతే అంతా చింతపండు మయంగా వుంది. అప్పటికే బాగా అలసిపోయాను. 'ఎవరైనా మేలుకొంటారేమో?' అన్న భయం అలస టకు ఊపిరి పోస్తూవుంది. గస నార్చుకోవడానికి కాసేపు నిలబడ్డాను.

రామాలయంలో వెంకట్రాయులు తాత బ్రహ్మయ్యగారి తత్త్వాలు పాడుకొంటున్నాడు. నిశ్శబ్ద నిశీధిలో ఆ పల్లె వాతావరణంలో పాట గంట కొట్టి నట్లు చెవిని పడుతూవుంది. 'నిను గనుగొని యముడు బెదురుచుండ, నీ వేటికి హరి సంతోషించ!' అని పాడు తున్నాడు తాత. నా నీతికి ఏ హరి సంతోషిస్తాడో? నన్ను, నా నీతిమాలిన పనిని చూచి ఏ యముడు చంకలు తట్టుతాడో నాకు తెలియదు. ఆ వయసూ కాదు. కానీ బెదురుమాత్రం వర్ణనాతీతం. దేవుడి మాట మనసులో మెదిలేసరికి నా దృష్టి నట్టింటి వైపు మరలింది. పండుగపబ్బాలకు, ఒకప్రొద్దులకు మా అమ్మ ఆ నట్టింటనే దేవుడికి పెడుతూ వుంటుంది. 'అక్కడనే దేవుడుంటాడు కాబోలు! నేను చేస్తున్న దొంగతనం చూస్తుంటాడు కాబోలు!'— అనుకొనేసరికి నా గుండె జలదరించింది. ఆ నట్టింట యేదో వెలుగు తళుక్కున మెరసినట్లయింది. నా ఒళ్లు ఝుల్లుమనింది. గట్టిగా రెండు చేతులతో కళ్లు మూసుకొన్నాను. కాస్త దడ తీరిం తర్వాత మెల్లగా కళ్లు విప్పి చూశాను. అక్కడేమీ లేదు. అంతా చీకటి. కన్ను పొడుచుకున్నా కానరాని చీకటి. ఆ చీకట్లో కనుపించని దేవుడికి మనసారా దండం పెట్టు కొన్నాను. లెంపలు వేసుకొన్నాను. 'స్వామీ! నా తప్పు క్షమించు. ఈసారి బియ్యమున్న దొంతరనే చూపించు!' అని మొక్కుకొన్నాను. ఆశ్చర్యం! ఈ సారి నేనుదించిన దొంతర నిండుకు బియ్యమే! మా వూరి గుంటకట్ట పైన సత్రములో ఓ వేదాంతి వుండేవాడు. ఆయన అంటూ వుండేవాడు. 'నాయనలారా! దొరలకైనా, దొంగలకైనా దేవుడు ఒక్కడే! వాడి వాడి కోరిక నను సరించి ఆ కరుణామయుడు కోరిక లీడేర్చుచుండును' అని. ఆ సమయములో ఆ మాట నిజమనిపించింది. 'ఒక్కొక్క బాలుడు ఒక్కొక్క దోసెడు బియ్యం కూడు తినగలిగితే ఎనిమిదిమందికి ఎంత బియ్యం కావాలి?' అని లెక్కల అయ్యవారు అడిగిన ప్రశ్నకు తకీమని సమాధానం చెప్పినట్లుగ ఎనిమిది దోసిళ్లు కావాలనుకొని, దేనికైనా మంచిదని పది దోసిళ్లకు పెంచి, పన్నెండు దోసిళ్లుగా పాతగుడ్డపరచి బియ్యాన్ని అందులో పోశాను. మూట గట్టడానికి దారం మరచి పోయాను. ఆ పాతగుడ్డ ఒక కొసను చింపాను. పాత గుడ్డ 'పర్' మని చినుగుతూంటే గుండె టకటక కొట్టుకొనింది. ఆ శబ్దానికికూడ ఎవరైనా లేస్తా రేమో అన్న భయం. కాసేపు కదిలీ మెదలకుండా

ఊపిరి బిగబట్టి కూర్చున్నాను. అదృష్టం బాగుంది. ఎవ్వరూ లేవలేదు. పాతగుడ్డలో బియ్యాన్ని జాగ్రత్తగా మూటగట్టాను. దించిన కుండలను యథాప్రకారం దొంతరలుగా పెట్టాను. ఎక్కడైనా నాలుగు బియ్యపు గింజలు కనబడితే, వాటిని ఉదయాన మా అమ్మచూస్తే, ఇలా బియ్యం ఎందుకు రాలాయి?' అని ఆమె ఆలోచిస్తే—గోవింద!—మా రెండవ అన్నయ్య గతి కన్నులకు కట్టినట్లు కన్పిస్తూవుంది. అందుకే తగుజాగ్రత్త తీసుకోవడానికి జేబులో దాచుకొని వుండిన అగ్గిపెట్టెనుతీసి ఒక్కపుల్ల వెలిగించాను. రాలివుండిన బియ్యపు గింజలను జాగ్రత్తగా దొంతర సందులలోనికి త్రోశాను కనబడకుండా! ఆ వెలుగులో గమనిస్తే, గుండె గుభిక్కుమనింది. నోట తడి ఆరింది. సాధారణంగా మొదట పెద్దకుండ, దానిపైన దానికంటె చిన్నది. అలా పెడుతూవస్తే దొంతర శంకువు ఆ కృతిలో ఉంటుంది. కాని చీకట్లో దొంతర పెట్టడంలో తారుమారయింది. ఒక దొంతర బాగా ప్రక్కకువాలి పడిపోవుటకు సిద్ధంగా వుంది. గబాలున దొంతరను కౌగలించుకొన్నాను మార్కండేయుడు శివలింగాన్ని కౌగలించుకొన్నట్లు, అడుగు కడవను రెండుకాళ్ళ సందున గట్టిగ పట్టుకొన్నాను. చిట్టచివరి కుండకు తలమోటించాను. నడుమధ్య కుండలను పొట్టకు శరీరానికి ఆనించుకొన్నాను. ఒరిగివుండిన దొంతరను జాగ్రత్తగా దించి మరలా సర్దిపెట్టేసరికి తలప్రాణం తోక కొచ్చింది. 'బ్రతుకు జీవుడా!' అని బయటపడ్డాను బియ్యపు మూటతో!


జామచెట్ల గుబురుమాటున తూగితూగిపడుతూ వుండిన శిద్దయ్య నన్నుజూచి ఎగిరి గంతేశాడు, ఇద్దరము పిల్లుల్లాగ అడుగులమీద అడుగులు వేసుకొంటూ ప్రహరీగోడ సమీపించాము. శిద్దయ్య గోడ నెక్కాడు. నేను బియ్యపుమూట వాడి చేతి కందించాను. వాడు వెంకట్రాయులు చేతి కందించాడు. మూట చేతులు దాటింది. శిద్దయ్య గోడ దాటాడు. నేను మెల్లగా తిరిగి వచ్చాను. చాపమీద కూర్చున్నాను. ఒక్కసారి చుట్టూ కలయచూశాను. నిర్భయంగా నిట్టూర్చాను. గబుక్కున దుప్పటి ముసుగుదన్ని పడుకొన్నాను.

ఆ మరుసటిరోజు ఉదయం మేమంతా గంజినీళ్ళ బావి గట్టుపైన చేరేసరికి దాదాపు పదిగంటలై ఉంటుంది. అందరము బడి ఎగ్గొట్టాము. సుమారు పాటి మూడు కుండలు, మూడు బలిసిన కోళ్ళు, బియ్యపు మూట అప్పటికి మా వనభోజనానికి మేము సముపార్జించిన సామగ్రి, బియ్యం, కుండలు మినహాయిస్తే—అలాంటి బలిసిన కోళ్ళను కొనడం మా వయస్సుకు మించిన పని. అందుకే చిన్నబ్బ నడిగాను వెల ఎంత అని? 'మూసిపెట్టిన కోళ్ళను, కుమ్మరవామిలో కుండలకు వెల యేముందిలే?' అని చాల నిర్లక్ష్యంగా బదులు చెప్పాడు చిన్నోడు. గుండె గుబిక్కుమనింది. ఈ సంగతి కాస్త ఊళ్ళో తెలిసిందంటే!—తల ఎత్తుకుని తిరగడమటుంచి పెద్దవాళ్ళు తాట వలిచేస్తారన్న భయం—భయంగానే మిగిలిపోయింది. రోటిలో తల దూర్చాము. 'అందరూ మూగదెయ్యాల్లా చలిమంట చుట్టూ కూర్చున్నట్లు కూర్చుంటే ముందు ముందు జరిగే దెట్లా? కావలసిన పని చూడండిరా!' హెచ్చరించాడు కేశవులు. 'జరిగే దేముంది? నిన్నను కొన్న ముగ్గురు పేటకు వెళ్ళి మసాలా సామానులు కొనుక్కురండి. జాగ్రత్త! అయ్యవార్లకంట ఎక్కడైనా పడేరు! మిగిలినవాళ్ళు అడవిమీదపడి ఎండుపుల్లలు యేరుదాం. అప్పటికి మధ్యాహ్న మవుతుంది. పేటకు వెళ్ళినవాళ్ళు తిరిగి వచ్చేస్తారు. అందరము కలిసి తెచ్చిన సద్దిబువ్వ ముగిద్దాం. ఆపైన వంట పని' అన్నాడు చిన్నోడు. వాడు మాపాలిటి నాయకుడు. నాయకుని మాటకు ఎదురులేదు. ముగ్గురు పేట వైపు పరుగుదీశారు. మరో ముగ్గురు అడవిమీద పడ్డారు. మేము మూడు రాళ్ల నమర్చి పెద్దపొయ్యిని తయారుచేయడంలో నిమగ్నులైనాము.

ఆహా! ఆ రోజు మా వంట. వర్ణనాతీతం. నలభీమాదిపాక శాస్త్రప్రవీణులు మా ముందు దిగదుడుపుకు పనికిరారు. తెచ్చిన బియ్యమంతా ఒక కుండలో పోసి ఒకడు కడుగుతున్నాడు. మరొకడు పొయ్యి రగిలిస్తున్నాడు. వేరొకడు ఎసరు పెట్టడానికి తెచ్చిన గంజిలాంటి నీళ్లను వడగడుతున్నాడు. ముగ్గురు కలిసి మూడు కోళ్లమీద పడ్డారు. చిన్నోడు సునాయాసంగా గొంతులు కోసి ఒక్కొక్క కోడిని విసిరి పారేస్తుంటే—అవి ప్రాణాలు పోలేక ఎగిరెగిరి పడుతున్నాయి. అవి ఎగిరెగిరి పడుతూండే వెంకట్రాయులు రెక్కలుతట్టుతూ తానూ ఎగురుతున్నాడు. మరొకడు అనుగుణంగా ఈలవేస్తున్నాడు. పాపం! గొంతులు తెగిన తరువాత

అవి మాత్రం ఎంతసేపని ఎగురుతాయి. నేల కొరిగిన కోళ్లను తలకొకటి తీసుకొన్నారు. బొచ్చు పెరికారు. ప్రక్కన మంటబెట్టి కాల్చారు. కోయడానికి పూను కొన్నారు. కూరవేసుకోవడానికి పలకలాంటిదేమీ లేద క్కడ. అటూ యిటుచూచి నున్నటి బండను సంపా దించారు. నీళ్లుబోసి కడిగారు. ఆ బండమీదనే మాంసమంతా వేశారు. తెచ్చుకున్నది ఒక కత్తి మాత్రమే! అదిగూడ చిరుకత్తి. దానితో ఎముకలు నరకడానికి వీలుపడక పోయేసరికి రాతిమీద రాయి బెట్టి పగలగొడుతున్నారు.

ఏ కుండలో ఎంత బియ్యం ఉడుకుతుందో మితం తెలియక తెచ్చిన బియ్యమంతా ఒక్కకుండలో పోసి ఉడికించడానికి పూనుకొనేసరికి ఆ కుండ మమ్మల్ని వుడికించడానికి తయారయింది. దాంతో కలిపి ఉడకలేక మాకు యేడుపు వచ్చినంత పని అయింది. పొంగి పొయ్యి పాలవుతూంటే—ఎంత సత మతమైనా ఆ కూడు సవ్యంగా ఉడకక పోయింది. అన్నం ఉడికిందనిపించేసరికి తాతలు దిగివచ్చారు. ఆ పై మాంసం వండడాని కారంభించాము. ఉప్పు తక్కువని కొందరు, కారం ఎక్కువని కొందరు, ఉడికితే చాల్లేరా అని కొందరు...అబ్బ! మా వంట కాలు తయారయ్యే సరికి దేవుళ్లు దిగి వచ్చినంత పని అయింది. అప్పటికి కానీ బాహ్య స్మృతి కలుగ లేదు. చూద్దుముగదా! ఆ అడవిలో అప్పటికే చీకటి చెప్పకుండా చెందకుండావచ్చి రాజ్య మేలుతూ వుంది. తల విరియ బోసుకున్న భూతాల్లా చెట్లుగాలికి రొద చేస్తున్నాయి. ఎక్కడో ఉన్నట్లుండి నక్కలు వికృతంగా అరుస్తున్నాయి. భయానకంగా వుంది ఆ అడవిలో ఆ రాత్రి. వంటకాలు పూర్తిచేసి అందరూ పొయ్యి చుట్టూ కూర్చున్నాము. నాలుగు ఎండు పుల్లలు మొగానవేస్తే పొయ్యి బాగా మండుతూ వుంది. ఆ మంట అక్కడి చీకటిని ప్రారదోలింది. ఆ వెలుగులో ఒకరి మొగం ఒకరు చూచుకొన్నాము. ఎవ్వరి ముఖంలోనూ కత్తి వేటుకు నెత్తురు చుక్క లేదు. అందరి గుండెల్లో భయం చోటు చేసుకుంది.

మాంసమున్న చోటికి దెయ్యాలు వస్తాయన్నది మా భయం!

'చూస్తూ కూర్చుంటే లాభంలేదు. బయిలు దేరండి. తలకొక్క సామాను చేతబట్టండి. మన వూరి గుంటకట్టమీదనే కూర్చుని తింటాం!'—ఆజ్ఞ లాగ పని చేసింది చిన్నోడి నోటినుండి వెలువడ్డ మాట! ఎనిమిదిమంది పుస్తకాల సంచులను, టిఫిను కేరియర్లను కలిపి యిద్దరు జవురుకొన్నారు. తీట తీగలను చుట్టలుగాచుట్టి నెత్తిమీద పెట్టుకొని ఒకడు కూటికుండను, మరొకడు కూరకుండను నెత్తికెత్తుకొన్నారు. కూరకుండలో కాస్త బొగ్గువేస్తే దెయ్యాలు రావట. ఆ పని మరచిపోకుండా చేశాడు చిన్నోడు.

అడవిలో నల్లబలుస అని ఒక జాతి కఱ్ఱ వుంది. అది పచ్చిదైనా దివిటీలాగ మండుతుంది. రేట్లావు కొమ్మలు నాలుగు విరచి ముట్టించుకొన్నాము. కూటికుండ కూరకుండ మోస్తున్న వాళ్లకు ముందు యిద్దరు, వెనుక యిద్దరు దివిటీలలో అంగరక్షకులుగా నిలబడ్డాం. మిగిలిన కుండను దిష్టి ఫలహారంగా చిన్నోడు 'పోలోపోలి!' అని పాయి మీద పగులగొట్టాడు. ఆ మీదట ఊరివైపు నడక సాగించాం. అబ్బ! ఆ రాత్రి మావన భోజనం మా వూరి గుంటకట్టమీద తలచుకొనే కొద్దీ కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వువస్తూ వుంది. ఏకాంతంగా మా వూరి బాటపైన నడుస్తూ విపరీతంగా నాలో నేను నవ్వడం ఎవరి కంటనైనాపడితే నిజంగా నన్ను పిచ్చివాడనక మానరు. నన్ను నేను సమాళించుకొని చూస్తే—అప్పుడు నేను ముగ్గురాళ్ల మిట్టమీద నడుస్తున్నాను.

ముగ్గురాళ్లమిట్ట కంటబడేసరికి మామిడి మాకులవంకమిట్ట మనసులోనుండి మాయమయింది. ఈ ముగ్గురాళ్లమిట్ట గత స్మృతిని గుండెపై అందంగా ముగ్గువేయడాని కారంభించింది. ఒక్కక్షణం నిలబడ్డాను. అక్కడే! నిజంగా అక్కడే! ఆ క్షణంలో జరిగినట్లు నా కంటి కగుపిస్తూ వుంది. బండ కాయంత బుల్లోడు వెంకట్రాయులు...ఒక చేతో నలిగిపోయిన పలక, మరొక చేతో ఆరు సొట్టలు తిరిగిన అల్యూమినియం టిఫిను కేరియర్, కొట్టుక పోవడంతో నెత్తురోడుతున్న మోకాళ్లు...మోచేతులు ముక్కు...ఆరున్నొక్క రాగాన్ని అందుకొన్న వెంకట్రాయులు నా కప్పుడు కనుపిస్తున్నాడు.

అవి యుద్ధం జరుగుతున్న రోజులు. పెట్రోలు కరవు. అయినా ఆ నాటి ప్రభుత్వము పెట్రోలు ధరలుపెంచి వేడుక చూడలేదు. పెట్రోలు దొరకక పోయేసరికి బస్సులన్నీ బొగ్గుతోనే నడుపుతున్నారు. బస్సు వెనుక భాగాన ఓ పెద్ద పీపా అమర్చివుంటారు. దానినిండుకు బొగ్గువేస్తారు. బొగ్గును మండించి దానినుండి ఓ గ్యాస్‌ను వ్యుత్పత్తిచేసి ఆ గ్యాస్‌తో బస్సును నడుపుతారు. బస్సువేగము బొగ్గునుండి వ్యుత్పత్తి అయ్యే గ్యాస్‌శక్తిమీద ఆధారపడి వుంటుంది. సాధారణంగా ఆ బస్సులు మిట్టలమీద ఒక్క ఎద్దుల బండిలాగ ఎక్కడంకద్దు. మా వూరి బాటపైన అలాంటి బొగ్గు బస్సు ఒకటి నడుస్తూ ఉండేది. ఆ బస్సు మామిడి మాకులవంక మిట్టమీద నిదానంగా ఎక్కుతూండే మాలో ఒకరిద్దరు ఆ బస్సు వెనుక భాగాన నిచ్చెనమీద తెలియకుండా ఎక్కి కూర్చునే వాళ్లం. ముగ్గురాళ్ల మిట్టమీద ఆ బస్సు నిదానంగా ఎక్కుతూంటే జాగ్రత్తగా క్రిందికి దూకే వాళ్లం. ఫలితంగా ఒక్కమైలుదూరం నడక తప్పిందని ఉప్పొంగి పొయ్యే వాళ్లం!

ఆ రోజు వెంకట్రాయులు ఒక్కడే ఎక్కి నిచ్చెనమీద గుంత కూర్చున్నాడు. మామిడి మాకుల వంకకట్టమీద బస్సు మెల్లగా ఎక్కుతూంటే, బస్సు వెళ్లిపోయింది. మేమంతా వెనుక నడిచి వెళ్లుతున్నాం. మేము ముగ్గురాళ్లమిట్టమీద చేరేసరికి మా కెదురైన దృశ్యం వెంకట్రాయుల దీనాకృతి. ఒళ్లంతా దుమ్ము నిండుక పోయింది. మోచేతులు, మోకాళ్లు, ముక్కు పగిలి రక్తం కారుతున్నాయి. ఇదైనా భరించ గలిగాడు కానీ, పాపం! వెంకట్రాయులు పగిలిన పలకను, సొట్టలు తిరిగిన అల్యూమినియం టిఫిను కేరియర్‌ను చూచి భరించలేకపోయాడు. పగిలిన పలక చూపిస్తాడు. ఏడుస్తాడు. సొట్ట తిరిగిన టిఫిను కేరియర్ చూపిస్తాడు. ఏడుస్తాడు!—ఆ రోజు అతడి దీనావస్థనుచూచి నిజంగా నేనూ యేడ్చాను. ఈ రోజు తలచుకొనే కొద్దీనవ్వు వస్తూవుంది. మా వూరి మట్టిబాటమీద పిచ్చివాడిలాగ నవ్వుతూ నడుస్తున్నాను పూర్వస్మృతి నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే!

'ఇదేనా అబ్బో రావడం! పిల్లజెల్లా అంతా బాగుండారా!...అదేంది నీలో నువ్వు పిచ్చోడిమాదిరి నవ్వుకుంటుండావే!...' పొద్దుగూట్లో పడుతున్నవేళ గొఱ్ఱెమందను యింటివైపు తోలుకపోతున్న గొల్ల గోవిందు ప్రశ్నించాడు. అదరిపడి ఈ లోకంలో పడ్డాను. పరిసరాలను పరిశీలించి చూస్తే—అప్పుడు నేను మఱ్ఱిమాకుల బండవద్ద నడుస్తున్నాను. ఇక కూత దవ్వులో మా వూరు ఉంది. నా స్థితి నాకే సిగ్గనిపించింది.

'అవును బావా!...యిదే రావడం...అంతా బాగుండారు.' కొలికి కొలికి సమాధానం చెప్ప గలిగాను. అరమరికలులేని పల్లె బ్రదుకుల్లో వావి వరుసలను కులమత ప్రమేయాలుండవు. నా నవ్వును గురించి మళ్లీ ప్రస్తావిస్తాడేమో అనుకొంటూ వుండగానే, ఒక గొఱ్ఱె బాటప్రక్కన పొలములో పడింది. దాని నదలిస్తూ పరుగెత్తాడు గోవిందు. 'బ్రదుకుజీవుడా!' అని నేను కాస్త తొందరగా గొర్రెమందను తొలగి ముందుకు నడిచాను.

ఇక కొన్ని నిముషాల్లో నేను మా వూరి గుంటకట్టను చేరుకుంటా ననుకొనేసరికి గుండె నిండుకూ ఆనందమే! బాట ప్రక్కన చింతచెట్లు—కొన్ని తరాలను చూచిన చెట్లు—నన్ను చూచి నవ్వుతున్నట్లున్నాయి. ఈ మధ్య తలెత్తిన చెట్లు పిల్ల గాలులతో వింజామరలు వీస్తున్నాయి. ఆ గుంటకట్ట మీద నా బాల్యదశ దినములలో నా యెదుట ప్రత్యక్షమయింది. ఉగాది పండుగనాడు తిండితిప్పలు మాని ఆడిన గచ్చకాయలాటలు...కార్తీక మాసంలో రాత్రి పూట పట్టిన సుదుదులు...వేసవి వెన్నెల్లో ఆడిన చెడుగుడు, ఉప్పరపట్టె ఆటలు...కట్టమీద వారది మీద కూర్చుని అర్ధరాత్రివరకు అనుంగు చెలికాడు బండి వెంకటరెడ్డితో గడిపిన రాత్రిళ్లు...నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి!...

నిముషాలు క్షణాల్లో గడచిపోయాయి. నేను మా వూరి గుంటకట్టపై నిలబడ్డాను. కనుచీకటి ఆవరిస్తూవుంది. ఆ గుంట కట్టమీద మొట్టమొదట నా కంటబడిన దృశ్యం నన్ను చకితుణ్ణి చేసింది. ఆ దృశ్యం నేను వూహించలేనిది. సహించలేనిది. అదొక పూరిగుడిసె. ఆ గుడిసె ముందొక పందిరి. పందిరగూటానికి వ్రేలాడుతూ వుందొక బోర్డు. ఎఱ్ఱటి అక్షరాల బోర్డు, పేదసాదల రక్తాన్ని పిండి—ఆ రక్తంలో ముంచి వ్రాసినట్లున్న అక్షరాలు... 'గవర్నమెంటు సారాయి అంగడి' అని వ్రాసి వుంది.

ఆ అసుర సంధ్యవేళలో అక్కడి వాతావరణం దారుణంగా వుంది. కొందరు త్రాగి తగవులాడుకొంటున్నారు. తప్పత్రాగిన కొందరు గుంట కట్టమీద బండలమీద ఒంటిమీద బట్టలున్నది లేనిది కూడ తెలియకుండా పడి దొరలుతున్నారు. నా పసితనంలో గుంటకట్టమీద గుడిసెలో ఆకు వక్క అమ్ముకొంటూవుండిన అలిమేలు తన అంగడిని గవర్నమెంటు సారాయి అంగడి ముందుకు మార్చింది. స్థలం మార్పులో వ్యాపారం మార్పు చెందింది. ఆకువక్క స్థానాన్ని కూరదోసె ఆక్రమించు కొన్నాయి. ఆమె చేతి క్రింద యిప్పుడు యిద్దరు పని చేస్తున్నారు. ఒకడు దోసె పోస్తూవుంటే మరొకడు సప్లయి చేస్తున్నాడు. ఓ అరుగుమీద కూర్చుని ఆమె చిల్లరడబ్బులు స్వీకరిస్తూవుంది. ముక్కుదాకా మెక్కి అప్పు బెట్టిన వాళ్లను మధ్యమధ్య ఎడా పెడా తిడుతూ వుంది. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా త్రాగుతున్న తీరు చూస్తే ఒళ్లు జలదరించింది. ఒకనాటికి యిప్పటికి తేడా తేల్చలేని పరిస్థితి అది. నా చిన్నతనంలో ఆ గుంట నిర్మలమైన నీటితో తొణికిసలాడుతూ వుండేది. గుంట నిండుకు పచ్చనికప్పు కప్పినట్లుగ దామరాకులు...విచ్చి వికసించిన పూవులు. నయనాహ్లాదకరంగా వుండేది. అలాంటి సాయంసమయాల్లో ఊళ్లో పెద్దలు వచ్చి ఆ బండమీద కూర్చునేవాళ్లు. ఊరి స్థితిగతులు చర్చించుకొనేవాళ్లు. తప్పుచేసిన వాళ్లని దండించేవాళ్లు. నాకు యిప్పటికీ యింకా బాగా జ్ఞాపకముంది. నీతికి నియమానికి కట్టుబడి కాపురం చేశారు ఆ వూళ్లో. ఆ రోజుల్లో ఎక్కడో అడవుల్లో ఎవ్వరికీ తెలియకుండా 'కాపుసారా' కాచేవాళ్లట. ప్రొద్దస్తమానం కాయకష్టం చేసే శ్రమజీవులు ఎవ్వరి కంటబడకుండా అంత పుచ్చుకొని ఎక్కడో ఒళ్లు తెలియక పడి నిద్రపోయేవారట. ఒకసారి బంగారుపని చిన్నబ్బ తప్పత్రాగి ఊళ్లో అసభ్యంగా ప్రవర్తించాడని మద్దిస్తం చేశారు. పది రూపాయలు తప్పువేశారు. మీసాలు మెలివేసి తిరిగే చిన్నబ్బ పది మందిలో తప్పు నంగీకరించి,

పదిరూపాయలు తప్పగా చెల్లించి, తలవంచుకొని వెళ్లి పోతున్న దృశ్యం నా కన్నులకు కట్టినట్లు కనిపిస్తానే వుంది. అలాంటి ఊళ్లో గవర్నమెంటు సారాయి అంగడి వెలిసింది. నిర్మల జలపూరితమై మూడూళ్లకు త్రాగు నీటికి ఆధారమైన నిండు గుంట ఎండిపోయింది, నీతి భీతి ఎండిపోయినట్లు, ఎండిన గుంటకు, సారాయి అంగడిముందు మండుతున్న కళ్లను చూడలేక తల దానంతట అది వాలిపోయింది. అడుగుమీద అడుగు వేసుకుంటూ ఊళ్లో అడుగుబెట్టాను.

మూడు కాళ్ల ముదుసలి గంగులయ్య తాత నన్ను చూచి నిలబడ్డాడు. వయసు మళ్లడంతో చూపు బాగా తగ్గినట్లుంది. ఊతకఱ్ఱమీద పండువారిన తనువును ఊనించి, ఎడమచేతి అరచేతిని కంటిమీద పడుతున్న వెలుగున కడ్డంగా పెట్టుకొని నిదానించి చూశాడు. నన్ను గుర్తించాడు.

'ఇదేనా నాయనా రావడం? అంతా బావుండారా!' పల్లెబ్రదుకుల్లో కనుపిస్తానే కుశల ప్రశ్నలు కురిపించడం పరిపాటి.

గంగులయ్య తాత అడిగిన దానికి 'ఆఁ! ఊఁ!!' అంటూ సమాధానం చెబుతున్నానే గాని నా దృష్టి అంతా ఊరిమీదనే వుంది. ఆ సంగతిని తాత పసి కట్టినట్టున్నాడు.

'ఏం జూస్తావు లే నాయనా! లచ్చిమి తాండవ మాడతావుండే ఒకప్పుడు. అట్లాంటి వూరు పాడుపడి పొయ్యింది. తల్చేవాడే లేడు. ఈ కరెంటు రానే వచ్చింది. బాయి కొక మోటు పెట్టేసినారు. 'రావన్నో' అని కపిలతోలే నాదుడే లేడు. పనీ పాటా లేకపాయ. ఆ గుంట కట్టమింద చూడలా?...తప్ప తాగేసి తన్నులాడుకునేది. పెద్దంతరం సిన్నంతరం లేకపాయ. ఎవుడు నాయనా ఈ వూరిని గురించి పట్టించుకునేది. అంతా అయిపోయింది. రాగి ఆకులో కొన మాత్రమే మిగిలుండాది. ఇంకీ వూళ్ల బాగు పడేదిలేదు నాయనా!...' గంగులయ్య తాత గొంతు బొంగురుపోయింది. ఏదో పోగొట్టుకొన్న తపనతో తాత తపిస్తున్నట్లుంది. 'చూస్తుండావు గదా! ఈ యీాదు లెట్లుండాయో? ఒకప్పుడు యియ్యేళ కాడ ఆలమందలు, గొఱెమందలతో యీాదులు పట్టలా వుండెనా? పాడికోసం, ఎరువుకోసం యింటి కొక్క మందగొడ్లుండె. దారిన పొయ్యేవాడు దాహమంటే మజ్జిగనీళ్లిస్తుంటిమి. ఇప్పుడవేవీ లేవు. అదేందో ఎలచ్చన్లంట! అవుండాయి. వాటితో తలలు పగిలి పోతుండాయి. వుండేది వుడ్డకు ముగ్గురు తక్కవైతే కూడ అందులో పార్టీలంట. చాలందానికి కోర్టు లంట. కొంపలు కూలిపోతుండాయి. పోనీ! నువ్వే చెప్పు నాయనా! నీ సిన్నతనంలో సూస్తుంటివి గదా!— ఎట్లాంటి కొట్లాటైనా అచ్చుబండ దగ్గిర తీరి పోతుండె గదా! ఇప్పుడదంతా లేదు నాయనా! రాఁవ రాఁవ! ఎందుకులే నాయనా! ఈ కడుపుసొద సెప్పితే తీరేది గాదు. ఈ వూళ్లింక బాగుపడేదిలేదు. వస్తా నాయనా! మడికాడ గొడ్లుండాయి!' అంటూ తాత ముందుకు సాగాడు.

తాత చెప్పింది అక్షరాలా నిజం. ఆ వేళప్పుడు వీధులు, ఆలమందలు, గొఱ్ఱెమందలతో నిండివుండేవి. పిల్లలు కేరింతలూ కొడుతూ ఆడుకొంటూ వుండే వాళ్లు. ఏ దూడ కుమ్ముతుందో, యే ఆవు త్రొక్కేస్తుందో అని తల్లులు పిల్లల్ని హెచ్చరిస్తూ యిండ్ల లోనికి లాక్కొనిపోతూ వుండేవారు. పిల్లలు గోల చేస్తూ వుండేవారు. ఆ చిహ్నాలేవీ కనుపించలే దక్కడ. ఉదయ మొకసారి, సాయంత్ర మొకసారి కళ్లాపు చల్లడంతో వీధులు అలికి ముగ్గు పెట్టినట్లు శోభాయమానంగా వుండేవి. ఆ సంప్రదాయము కూడ నశించినట్లుంది. వీధులు దుమ్ము కొటు కొంటూ పాడుపడినట్లున్నాయి. రెండడుగులు ముందుకు వేశాను. ఊరి మధ్య రామాలయం కంటఁబడింది. ఆ గుడిని చూసేసరికి గుండె చెరువయింది. ఆ గుడి.. ఆ వూరికి మకుటాయమానంగా వెలుగొందిన అందాల గుడి...అంతా పడిపోయింది. గర్భగుడిలో పుట్టలు పెరిగాయి. ఆలయం వెనుక భజనతోట. తోటవుండిన చిహ్నాలుకూడ లేవక్కడ. చీకటిని మరుగుగా చేసుకొని ఆ వూరి వాళ్లు ఆ ప్రదేశాన్ని మరుగుదొడ్డిగా వుప యోగించుకొనేటట్లుగా వుంది. అచ్చుబండవద్ద మఱ్ఱి మాను. ఎన్నో ధర్మా ధర్మాల చర్చలకు సాక్షీభూతంగా నిలబడ్డ మాను. కొమ్మలంతా ఎవరో నరికివేస్తే— బోదెమాత్రం మొద్దులాగ నిలబడి వుంది, నాలుగు పాదాల ధర్మగోవు ఒంటి కాలుమీద నిలబడ్డట్టు.

ఎంతో సందడిగా వుండవలసిన ఆ సంజవేళలో ఎటు చూచిననూ కాంతి విహీనంగా కనుపిస్తూ వుంది. నా గుండె కలుక్కు మనింది. అక్కడ నిలబడలేక, నిలబడి పాడుబడినట్లున్న ఆ కొంపలను చూడలేక గిరుక్కున వెనక్కు తిరిగాను. 'అప్పుడే వెళ్లిపోతున్నావే! ఇంకనూ బాగా చూడు నువ్వు మరువలేని మీ వూరిని బాగా చూడు!' అని నన్ను హెచ్చరించినట్లుగ ఊరి మధ్యగ ఒక విద్యుద్దీపము వెక్కిరిస్తూ వెలిగింది. వంచిన తలను పైకెత్తకుండా వడివడిగా గుంటకట్టపై కెక్కాను. పంచాయతీ ఆఫీసు అనబడే పూరి గుడిసెలో గ్రామాభ్యుధయము, పాడిపంటలు...ఏవేవో పెద్ద పెద్ద మాటలు రేడియోలో ప్రసారమవుతున్నాయి. ఆ ప్రగతి మాటలను నా చెవిని పడనీయకూడదను సదుద్దేశంతో బస్సు రొద చేసుకొంటూ వస్తూ వుంది. పాతికేళ్లలో దేశం సాధించిన ప్రగతి ఫలితంగా...ఆ వేళప్పుడుకూడ...ఆ మారుమూల రోడ్డులో వస్తున్న బస్సు అది! ఆపాను. ఆ బాట మీద ఓవర్‌లోడ్‌కు అర్థం తెలియదు. కాబట్టి ఆగింది. ఎక్కాను. కూర్చొనడం ఊహాకందని విషయం కాబట్టి నిలబడ్డాను.

'దేశానికి వెన్నెముకలైన గ్రామాలు యివేనా? ఈలాంటి గ్రామాలమీదనే దేశ భవిష్యత్తు ఆధార పడివుందా? ఈ దేశం ఎన్నటికైనా 'సుఫలాం!' అవుతుందా?'—అన్న ఆలోచనలు నా మనస్సును కెలికే సరికి—మా వూరు మళ్లీ ఒక్కసారి నా కంటిముందు మెదిలింది. ఎండిపోయిన మంచినీటిగుంట...గుంట కట్టమీద మండుతున్న కళ్లు...శిథిలమైన రామాలయము ... పాడుకొట్టుకొంటున్న కొంపలు......రేడియోలో పంచవర్ష ప్రణాళికలు—గ్రామాభ్యుదయము... నా మనస్సును పిండుతున్నాయి. నేను నలిగిపోతున్నాను బస్సులో క్రిక్కిరిసిన మనుష్యుల మధ్య. పట్టించుకోని బస్సు మా వూరి మట్టిబాటపై పడుతూ లేస్తూ పోతూనే వుంది. ఎందుకో నాకు తెలియకనే నా కంటిలో నీరు తిరిగింది!

---

